క్లుప్తంగా

5కే రన్‌లో వంగర యువకుడి సత్తా


గోవర్ధన్

వంగర: విశాఖపట్నంలో భారత్ నివేశ్ రన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే ర న్ పోటీల్లో వంగర మండలంలోని జగన్నాథవలస గ్రామానికి చెందిన యువకుడు నాచు గోవర్ధన్ సత్తా చాటాడు. ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో అతడు ప్రథమ స్థానంలో నిలిచి, ప్రశంసాపత్రం, మెడల్ సొంతం చేసుకున్నట్లు అతడు తెలిపారు.

శ్రీరామదీక్షలు ప్రారంభం


శ్రీరామదీక్షలు చేపట్టిన భక్తులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చింపేట గ్రామానికి చెందిన 150 మంది భక్తులు శ్రీరామదీక్షలు ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ అప్పటివరకు నిష్టతో పూజలు చేసేందుకు గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి ఒకరు ఇలా శ్రీరాముని దీక్షలు చేపట్టినట్లు గ్రామ పురోహితులు రంపా హనుమంతురావుశర్మ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ప్రారంభించి, ప్రయాణీకురాలికి మంచినీటిని అందిస్తున్న సీఐ శ్రీనివాసరావు

రాజాం సిటీ: స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో పట్టణానికి చెందిన స్నేహం అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి, ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్నేహం అసోసియేషన్ కన్వీనర్ అంబికా కోటేశ్వరరావు, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యబోధించాలి

కొత్తవలస: పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర సూచించారు. స్థానిక సబ్బవరం రోడ్డులోని విజ్ఞాన భారతి పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి నిర్వహించారు. అతిథి గా హాజరైన జడ్జి విజయచంద్ర మాట్లాడుతూ పిల్లలకు నైతిక విలువలు నేర్పినప్పుడే సమాజంలో నేరాలు తగ్గుతాయన్నారు. ఈసందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బీవీకే సంస్థల పరిపాలన అధికారి కన్నన్, వైద్యులు తెన్నేటి సుబ్బారావు, పాఠశాల ప్రినిపాల్ కె.సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రు లు పాల్గొన్నారు.

నలుగురు పందాల రాయుళ్ల అరెస్టు

కొత్తవలస: మండలంలోని చిన్నమన్నిపాలెం గ్రామం శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. కోడి పందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి నాలుగు కోడి పుంజులను, రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

26న ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 26వ తేదీన స్వయం ఉపాధి ఉచిత శిక్షణకు సంబంధించి, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని నైరెడ్ డైరెక్టర్ ఎం.రాజేష్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 ఏళ్ల వయసు స్త్రీ, పురుషులు అర్హులన్నారు. పురుషులకు సంబంధించి, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్‌కండిషన్(75 రోజులు), ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ అండ్ ఫ్యాన్ రివైండింగ్, టాక్సీ డ్రైవింగ్ (30 రోజులు)ల పాటు శిక్షణ ఉంటుందన్నారు. స్త్రీలకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, లేడీస్ టైలరింగ్‌లలో 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులంతా ఒరిజినల్ పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్ కార్డు, రైస్‌కార్డుతో పాటు ఇతర విద్యార్హతలకు సంబంధించిన సరిఫికెట్లను తీసుకురావాలన్నారు. శిక్షణకు ఎంపికైన వారికి ఈ నెల 30వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9014716255, 9491741129, 9866913371, 6304626372ను సంప్రదించాలన్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మండలంలోని రావివలస పంచాయతీ పరిధిలోని పలు గిరిజన గ్రామాలతో పాటు కొండకెంగువ పంచాయతీ పరిధిలో ఉన్న జుమ్ముvalasa గిరిజన గ్రామంలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రజలతో మమేకమై ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో పెన్షన్ కావాలన్నా, పథకం కావాలన్నా, రేషన్‌కార్డు కావాలన్నా టీడీపీ నేతల కాళ్లచుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు అలా కాదని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా పాటుపడుతున్న సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుని, రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలనను కొనసాగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాదరావు, రావివలస సర్పంచ్ సోముల కుమారి, సీనియర్ నాయకుడు బెవర ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రాజాం: ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ తదితరులు

రాజాం: రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరుకుంటున్నారని, వారి కోరిక నెరవేర్చాలని సిర్లి పోతన్న, ఎల్లమ్మతల్లిని రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ వేడుకున్నారు. స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం జరిగిన సిర్లి పోతన్న, ఎల్లమ్మ సంబరాల్లో ఆయన పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తాను కూడా గెలిచేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు విష్ణుపాత్రుని శంకరరావు, బెహర తవుడు, విష్ణుపాత్రుని నరసింహులు, పాత్రుని గణేష్, విష్ణుపాత్రుని ఈశ్వరరావు, శంకరరావు, రామస్వామి, ఆలయ అర్చకులు రాజ్‌పంతులు, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిరుల పోతన్న జాతర


రామభద్రపురం: సిరులపోతన్నను ఊరేగిస్తున్న భక్తులు


బొబ్బిలి: పూజలందుకుంటున్న ఎల్లమ్మ

రామభద్రపురం: మండల కేంద్రంలో ఏటా చిన్నమ్మతల్లి పండగ ముందు నిర్వహించే సిరుల పోతన్న జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిరుల పోతన్న, ఎల్లమ్మ జాతరగా పిలుచుకునే ఈ జాతరకు వేలాది మంది భక్తులు హాజరై, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గుడ్లు, ఉలవలతో కలిపిన బియ్యం, కొత్తచీరలను భక్తులు సమర్పించారు. అమ్మవారిని, పాము ఆకారంలో ఉన్న సిరులపోతన్నను మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మండల కేంద్రంతో పాటు కొండకెంగువ, బూసాయవలస, ముచ్చర్లవలస, సోంపురం, మద్రివలస, నాయుడువలస, తారాపురం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ జాతరలో పాల్గొని, పూజలు చేశారు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బొబ్బిలి: పట్టణంలోని చిక్కాల రెల్లివీధిలో సిరుల పోతన్న, ఎల్లమ్మ జాతర ఆదివారం నిర్వహించారు. పట్టణ వాసులతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు జాతరకు తరలి వచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రామభద్రపురం మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన 40 కుటుంబాల వారు టీడీపీని వీడి, వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి, సాదర స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులమై తామంతా పార్టీలో చేరామని వారు అన్నారు. పార్టీలో చేరిన వారిలో దేవుపల్లి రాజు, దేతాన సురేష్, దేవతాన సోములు, బెల్రి రాజు, అలజంగి రాజు, రేజేటి కిరణ్, అలజంగి ధర్మ, రేజేటి చంటి, అలమండ రవి, యజ్జల మదన్, రేజేటి సన్యాసిరావు, దేవతన మహేష్, పెంకి అజయ్, భోగి రాజ్‌కుమార్, ఆడ రామకృష్ణ, పాలకొండ ఉదయ్‌కుమార్, రేజేటి నరసింగరావు, రేజేటి రామ్‌ప్రసాద్, పెంట ప్రదీప్, రేజేటి శ్రీతేజ, యజ్జల రామయ్య తదితర కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హర్షాతిరేకాలు


రాజన్నదొరకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించిన ఆనందంలో స్వీట్లు తినిపించుకుని, ఆనందం వ్యక్తం చేస్తున్న పార్టీ నేతలు

మెంటాడ: డిప్యూటీ సీఎం పీడీక రాజన్నదొరకు మళ్లీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా కలిసి ఆదివారం కేక్ కట్ చేసి మరీ సంతోషం వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీకి మారుపేరు అయిన రాజన్నదొరను రానున్న ఎన్నికల్లోనూ అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు అన్నారు. ఈ క్రమంలో కార్యకర్తలంతా కలిసి జై జగన్.. జై..రాజన్న అని నినాదాలు చేశారు. రాజన్నదొరకు టికెట్ ఇచ్చిన ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ, పార్టీ నాయకులు రత్నాకర్ నాయుడు, అచ్యుత్, పైడపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు, కేంద్ర బలగాలు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఎస్‌ఐ జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు కలిసి ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు అన్నివిధాలా సహకరించాలని ప్రజలను కోరారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున, సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులకు సహకరించవద్దని ప్రజలను కోరారు. ఎన్నికల దృష్ట్యా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఎన్నికల ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

బొబ్బిలి: మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలోని పదో తరగతి విద్యార్థులకు ఏపీజే అబ్దుల్ కలాం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గేదెల చంద్రినాయుడు ఆదివారం పరీక్ష సామగ్రి వితరణ చేశారు. పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా అట్టలు, పెన్నులను అందజేసినట్లు ఆయన తెలిపారు. పరీక్షలు బాగా రాసి, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

వంగర: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బూరి సత్యం నాయుడు, భూలక్ష్మి దంపతులు ఆదివారం పరీక్ష సామగ్రిని వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ముద్దాడ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

25 మద్యంసీసాల స్వాధీనం

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 25 మద్యంసీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, సంబంధిత వ్యాపారిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామన్నారు.

ఎస్‌బీఐ సేవలపై అవగాహన

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో కళాజాతా ప్రదర్శన ద్వారా ఎస్‌బీఐ(భారతీయ స్టేట్ బ్యాంక్) సేవలపై ఆదివారం అవగాహన కల్పించారు. వంగర బ్రాంచి మేనేజర్ కృష్ణారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంకు ద్వారా అందజేసే పంట రుణాలు, బంగారు ఆభరణాలపై ఇచ్చే రుణాలతో పాటు వివిధ రకాల బ్యాంకు రుణాలు, సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన పథకాల ప్రయోజనాలను వివరించారు. ఆర్థిక అక్షరాస్యత వివరించి, మ్యాజిక్ షో చేపట్టారు. కార్యక్రమంలో కళాజాత సభ్యులు రఘురామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ

బొబ్బిలి: పట్టణంలోని ఎన్‌జీవో హోమ్‌లో డోకల రాములు మాస్టారి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, రిటైర్డ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు రౌతు రామ్మూర్తినాయుడు కలిసి రాములు మాస్టారి సేవలు కొనియాడారు. ఆయన విద్యార్థుల విద్యాప్రగతికి, ఉపాధ్యాయ సంఘ అభివృద్ధి, సంక్షేమానికి విశేషమైన కృషి చేశారన్నారు.

వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించండి


బొద్దాంలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ వర్షిణి, సర్పంచ్ తవిటమ్మ తదితరులు

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, బొద్దాం గ్రామ సర్పంచ్ నక్క తవిటమ్మ కోరారు. ఇంటింట ప్రచారంలో భాగంగా మండలంలోని బొద్దాం గ్రామంలో ఆదివారం పర్యటించిన వారు ఐదేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. మన మంచి కోరే.. మనందరికీ అందుబాటులో ఉండే రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌ని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ నక్క శ్రీను, వీవర్స్ సొసైటీ ప్రెసిడెంట్ కనకం శ్రీను, పీఏసీఎస్ డైరెక్టర్ నక్క ఉమ, బూత్ కన్వీనర్ అలజంగి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చిన్నమ్మతల్లి పండగ


జాతరకు సిద్ధం చేసిన అమ్మవారి ఆలయం

రామభద్రపురం: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి గాంచిన రామభద్రపురం చిన్నమ్మతల్లి పండగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు ఈ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం శివరాత్రికి ముందు అమ్మవారిని గద్దె వద్దకు తీసుకువచ్చి, శివరాత్రి వెళ్లిన మూడో వారంలో అనుపోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో అమ్మవారి జాతరకు సంబంధించి, ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం జరగనుండగా, మంగళవారం అమ్మవారి ఘటాల తిరువీధి, బుధవారం అంజలి రథోత్సవం, అనుపోత్సవం నిర్వహిస్తారు. ఈ జాతరకు విజయనగరం జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలతో పాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారు కూడా అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరనున్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరలో సోమవారం భాగవతం, మంగళవారం క్లాసికల్ కోలాటం, దాండియా డ్యాన్స్, యమలీల నృత్య ప్రదర్శన, మ్యూజికల్ డీజే, కాంతార నృత్య ప్రదర్శన, తీన్మార్ డ్రమ్స్, ఆ రాత్రి కదలివచ్చిన కనకదుర్గ ప్రదర్శన, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ప్రతీ వీధిలో బుర్రకథలు, రేలారే రేలా వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో 70 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు


తెర్లాం: పెరుమాళి ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: మండలంలో సోమవారం నుంచి మూడు పరీక్షా కేంద్రాల్లో జరగనున్న పదో తరగతి పరీక్షల ఏర్పాట్లను మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు ఆదివారం పరిశీలించారు. తెర్లాం, పెరుమాళి హైస్కూళ్లతో పాటు, పెరుమాళిలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ప్రభుత్వం పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో తెర్లాం, వెలగవలస, లోచర్ల, పెరుమాళి, కాగాం, నెమలాం, ఉద్దవోలు హైస్కూళ్ల విద్యార్థులతో పాటు పెరుమాళి ఆదర్శ పాఠశాల, కుమ్మరిపేట కేజీబీవీ, తెర్లాంలోని శ్రీవేంకటేశ్వర, గౌతమి హైస్కూళ్లకు చెందిన 599 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యార్థులు పరీక్ష రాసేందుకు బెంచీలు ఉన్నవీ, లేనివీ ఆయన తనిఖీ చేశారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

వంగర: మండలంలోని మూడు పదోతరగతి పరీక్ష కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లుతో పాటు సిబ్బంది నియామకం పూర్తి చేసినట్లు ఎంఈవోలు పి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావులు తెలిపారు. వంగరలో 200 మంది, మడ్డువలసలో 197 మంది, ఎం.సీతారాంపురంలో 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు.

రేగిడి: మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రేగిడి, సంకిలి, లక్ష్మీపురం, ఏపీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా గుర్తించామని ఎంఈవో ఎంపీ ప్రసాదరావు ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 660 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ దృష్ట్యా మండలంలోని పరీక్ష కేంద్రాలను ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలుచేయాలి


తెర్లాం: సూచనలిస్తున్న ఎంపీడీవో మధుసూదనరావు


రామభద్రపురం: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనరాణి, ఎంపీడీవో ఈశ్వరమ్మ


రాజాంలో రాజకీయ ప్రచార ఫ్లెక్సీలు తొలగిస్తున్న దృశ్యం

తెర్లాం: రాష్ట్ర వ్యాప్తంగా మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్, ఏఆర్‌వో ప్రసన్నకుమార్, ఎంపీడీవో బి.మధుసూదనరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమావళి అమలుపై అధికారులు, సిబ్బందితో ఆదివారం సమావేశమైన వారు పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, వాల్‌పోస్టర్లు, కటౌట్లు తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రకటనల బోర్డులపై ఉన్న పీఎం, సీఎం, మంత్రుల ఫొటోలకు పేపర్లు అతికించాలన్నారు.

బాడంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలతో తహసీల్దార్, ఎన్నికల ఏఆర్‌వో రాజారావు ఆదివారం సమావేశమై, ఎన్నికల నియమావళి అమలుపై పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎక్కడా రాజకీయ పార్టీలు, నాయకుల బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌లు ఉండడానికి వీలు లేదన్నారు. నాయకుల విగ్రహాలకు కూడా ముసుగు వేయాలన్నారు.

రామభద్రపురం: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మండలంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ ఎ.సులోచనరాణి, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మలు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలతో సమావేశమై, రాజకీయ పార్టీలు, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులంతా తప్పనిసరిగా ఎన్నికల నియమావళి పాటించేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు తొలగించాలన్నారు. బస్టాండ్, ప్రధాన రోడ్ల కూడళ్లకు ఇరువైపులా, మీటింగ్ ప్రాంతాల్లో ఉన్న హోర్డింగ్‌లను తొలగించాలన్నారు. కార్యాలయాల్లో ఉన్న ఫొటోలు, క్యాలెండర్లు తీసివేయాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలను క్లాత్‌తో కప్పి ఉంచాలన్నారు.

రేగిడి: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల నియమావళిని మండలంలోని అధికారులు అమలు చేస్తున్నారు. రాజకీయ పార్టీలు, నాయకులకు చెందిన పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు, స్టిక్కర్లను తొలగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు రాజకీయ ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని తహసీల్దార్ రాములమ్మ తెలిపారు.

రాజాం: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పట్టణంలో పలు రాజకీయ పార్టీలు, నాయకుల ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు ఆదివారం తొలగించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళిని తూ.చ తప్పకుండా పాటించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు.